

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

### (కిందటి సంచికనుండి కొనసాగింపు)

**నేను నలుగురితో** కలిసి రోడ్ ట్రిప్‌కి వెళుతున్నానని తెలిసి దీపిక తన స్నేహితురాలు పాపని కూడా చేర్చుకోమంది. తను కొత్తగా వచ్చింది నాలాగే. ఈ సంగతి చెబితే మిగిలిన ముగ్గురు కూడా సరే అన్నారు. మా అందరికి ఒకే ప్రశ్న కలిగింది. 'ఆ అమ్మాయి నిజం పేరేంటి?' మాలో కలవగలుగుతుందా లేదా అని తెలుసుకునేందుకు లంచ్‌కి కలుద్దామని పిలిచాము. చూడ్డానికి మామూలుగానే ఉంది. కెమిస్ట్రీలో పి.హెచ్.డి చేస్తుంది. కర్నాటకలో సెటిల్ అయిన తెలుగువారు. అరవ వాళ్ళలాగా పిచ్చి తెలుగు కాక బానే మాట్లాడింది. కలిసిన గంటన్నర సేపు పాప తన పేరు చెప్పలేదు. మేమూ అడగలేదు. తను వెళ్ళిపోయాక మేము నలుగురం ఆ విషయం గురించి చాలాసేపు చర్చించుకున్నాము.

వాట్సఆప్‌లో ఒక గ్రూప్ క్రియేట్ చేసి దాంట్లో ఫేస్‌బుక్ ప్రొఫైల్ పేరు పంపమని అందరినీ అడిగాడు. మేమంతా వెంటనే రిప్లై ఇచ్చాము. ఆ అమ్మాయి మాత్రం ఫేస్‌బుక్ వాడను అని బదులిచ్చింది. దాంతో మా ప్రయత్నం వృథా అయింది.

నేను ఈ రోడ్ ట్రిప్‌కి సర్దుకునేందుకు ఐదు నిమిషాల కన్నా తక్కువే పట్టింది. ఎలా అయినా చలి కాబట్టి ఎక్కువ రకాలు అవసరంలేదనిపించింది. మాతో పాటు వస్తున్న పల్లవి మాత్రం చాలా హడావిడి చేసింది. తీరా బయలుదేరే సమయానికి మేమంతా ఒక చిన్న సూట్ కేస్ లేదా బ్యాక్ ప్యాక్ తెస్తే, రోషణ్ మాత్రం ఒక పెద్ద సూట్‌కేస్‌ని తెచ్చాడు. దాంతో అవి డిక్కీలో సర్దడానికి ఎక్కువసేపు పట్టేసింది.

అసలు అంత పెద్ద సూట్‌కేస్‌లో ఏముందో అని నాకు కాస్త కుతూహలం కలిగింది. బయలుదేరేముందు అన్నయ్యకి మెసేజ్ చేసి వెనక సీట్‌లో కూర్చున్నాను. బయలుదేరిన కొంతసేపటికి అందరం మాటల్లోమునిగాము. తెలియకుండానే షికాగో చేరిపోయాము. చుట్టూ అంత మంచు, మా ఊరిలా కాక చాలా ట్రాఫిక్ ఉంది. తినడానికి సబ్‌వేలో ఆగినప్పుడు ఎక్కడెక్కడి వెళ్ళాలి అని చర్చించుకున్నాము. రాత్రి ఉండేందుకు రెండు మోటెల్ రూమ్స్ ని బుక్ చేసాము. కారెక్కగానే ఎంతో నిద్రొచ్చి ఓ చిన్న కునుకు తీసాను.

ముందుగా బీన్ దగ్గరకి వెళ్ళి ఫోటోలు దిగాము. ఆ తర్వాత విల్లిస్ టవర్, నేవీ పియర్‌కి వెళ్ళాము. స్కై డెక్‌లో ఆ గ్లాస్ ఫ్లోర్ మీద నిలబడేందుకు నేను ఎంతో భయపడ్డాను. అక్కడనుండి పడిపోను అని తెలిసినా ఎందుకో చాలా భయం వేసింది. నేవీ పియర్‌లోనే పాత సినిమా పరదేశీలో ఒక పాటని చిత్రీకరించారని రోషణ్ చెప్పాడు. పాప, పల్లవి, నేను ఆ సినిమా చూడలేదు. దాంతో ఆ సంభాషణ అక్కడితో ఆగిపోయింది. చీకటి పడ్డాక చలి పెరగడంతో బయట ఎక్కువసేపు ఉండకూడదని నిశ్చయించుకున్నాము. అందరం అలసిపోవడంతో టాకోబెల్ డ్రైవ్ త్రూ తీసుకుని మోటల్ చేరాము.

అంతా రిలాక్స్ అయ్యి కుదట పడ్డాక ఒక గదిలో కలిసి తిందామనుకున్నాము. అబ్బాయిలు మా గదికి వస్తే వాళ్ళు వెళ్ళేదాక నేను పడుకోలేనని వాళ్ళ గదికి మేము వస్తామని చెప్పాను. రోషణ్ ఓ గంటపాటు కుస్తీపడి లాప్‌టాప్‌ని టీవీకి కనెక్ట్ చేసాడు. అంతా కలసి తింటూ ఆ పరదేశి సినిమా చూడ్డం మొదలు పెట్టాము. అది నైన్‌టీస్ లో వచ్చిన సినిమా. అందులో వారి అమెరికెన్ ఆక్సెంట్‌కి పగలబడి నవ్వాము. హీరో, హీరోయిన్లు అంతా కొత్తవారట. అందుకే కాబోలు అన్ని సీన్స్‌లో ఒకే ఎక్స్‌ప్రెషన్. దాదాపు గంట చూసాక నాకు నిద్ర ముంచుకొచ్చేసరికి నేను వెళ్ళిపోతానని చెప్పాను. అన్నయ్యకి ఫోటోలు కొన్ని పంపి కళ్ళు మూసాను. తిరిగి మర్నాడు పల్లవి ఫోన్‌లో మాట్లాడుతుంటే మెలుకువ వచ్చింది.

"డిస్టర్బ్ చేసానా?" అడిగింది.

"టైం ఎంత?"అడిగాను.

"10 అయింది"

"అప్పుడే? ఇవాళ్ళ ప్లాన్ ఏంటి?"

"సైట్ సీయింగ్. లంచ్ తర్వాత సెయింట్ లూయిస్‌కి వెళ్తాము. రెడీ అవుతావా?"

నేను లేచేందుకు వెయిట్ చేస్తున్నారనుకుని "సారీ.. సారీ, యా అవుతాను" వెంటలే లేచాను.

"పాప బ్రష్ చేస్తుంది. పక్క రూముకి వెళతావా?

"లేదు. నేను వెయిట్ చేస్తా."

"అయితే తనని పక్క రూములో రెడీ అవ్వమందాం. వాళ్ళిద్దరూ రూములో లేరు."

"ఇంతకీ తన పేరేంటో అడుగుదామా?"

"బావుండదేమో?"

ఇంతలో తను బయటికి వచ్చింది. అంతా రెడీ అయ్యి చెకౌట్ చేసి ముందుగా గిరార్‌డెల్లి చాక్లెట్ షాప్‌కి వెళ్ళాము. అక్కడి హాట్ చాక్లెట్ నాకు ఎంతో నచ్చి వెళ్ళేప్పుడు మరొకటి తీసుకున్నాను. అక్కడ కొంత నడిచి డౌన్‌టౌన్‌లో ఫోటోలు తీసుకున్నాము. ఆ తర్వాత రివర్ క్రూజ్‌కి వెళ్ళాము. నేను పడవలో ఎక్కడం ఇదే మొదటి సారి. ఎంతో ఆహ్లాదంగా సాగిపోయింది. మేమయిదుగురుం నవ్వుతూనే ఉన్నాము. లంచ్‌కి ఇండియన్ రెస్టారెంట్‌కి వెళ్ళాము. కారులో కూడా ఎవరో ఏదో అనడంతో మళ్ళీ అంతా నవ్వాము.

"ఇంత నవ్వితే ఏదో  చెడు జరుగుతుంది" పల్లవి అంది.

"అవి అన్నీ మూఢ నమ్మకాలు" నేను అన్నాను.

"నిజంగా జరుగుతుంది. నేను ఇలా నవ్వీ నవ్వీ ఎన్నోసార్లు ఏడ్చాను."

"కో ఇన్సిడెన్స్ అయ్యుంటుంది"

"కాదు నిజమే. ఇప్పుడు ఏమీ కాకపోతే బావుండు."

ఇంతలో రెస్టారెంట్ చేరాము. భోజనం ఎంతో రుచికరంగా ఉంది. భోజనం పూర్తయ్యాక కాస్త నిద్రమత్తుగా అనిపించింది. కానీ మేము మ్యూజియమ్స్ కి వెళ్ళడంతో నడుస్తూ ఆ భుక్తాయాసం తీరింది. ఇక్కడ ఇన్ని మ్యూజియంలు ఉన్నాయని నాకు తెలీదు. అన్నీ రకరకాలు. సైన్స్, ఆర్ట్స్‌తోపాటు హిస్టరీకి సంబంధించిన మ్యూజియం కూడా ఉంది. ఆశ్చర్యంగా అన్నిట్లో నాకు ఎక్కువ నచ్చింది ఆ హిస్టరీ మ్యూజియమే.

రవి అడగడంతో హెమింగ్‌వే పుట్టిన స్థలానికి వెళ్ళి అక్కడినుండి సెయింట్ లూయిస్‌కి బయలుదేరాము. షికాగోలాగా కాఅ ఆ డ్రైవ్ చాలాసేపు పట్టినట్టు ఐపించింది. ఎప్పటిలానే నేను కాసేపు నిద్రపోయాను. ఆ తరువాత కాసేపు అంత్యాక్షరి ఆడాము. షికాగోలా కాక సెయింట్ లూయిస్‌లో ముందు మోటల్‌కే వెళ్ళాము. సామాను పెట్టి, కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నాక ముందుగా గేట్‌వే ఆర్చ్‌కి వెళ్ళాము. నాకు అది అంత గొప్పగా అనిపించలేదు. తరవాత బెసిలికాకి వెళ్ళాము. అది నాకు బాగా నచ్చింది. బహుశా చలివల్ల కాబోలు, ఎక్కువమంది జనాలు లేరు. ఆ తరవాత ఆర్ట్

మ్యూజియంకి వెళ్ళి మళ్ళీ టాకోబెల్ డ్రైవ్ త్రూ తీసుకుని గదికి వెళ్ళాము. షికాగోలోలాలాగా ఈ మ్యూజియం అంత గొప్పగా అనిపించలేదు. ముందు ఇక్కడికి వచ్చి ఉంటే ఇది కూడా నేను బాగా ఆశ్వాదించేదాన్ని కాబోలు అనిపించింది. నిన్నటి పరదేశి సినిమాని ఓ అరగంట చూసి మళ్ళీ నవ్వుకున్నాము. ఆ తరవాత నేను నిన్నటిలాగే ముందుగా పడుకున్నాను.

ముందు రోజులా కాక కిటికీలోంచి వెలుతురు రావడంతో మెలుకువ వచ్చింది. లేచి కిటికీలోంచి చూస్తే అంతా తెల్లగా ఉంది. సన్నగా స్నో పడుతూ ఎంతో అందంగా ఉంది. అందరినీ లేపి బయటికి వెళ్ళాము. కాసేపు స్నోలో ఆడుకుని తయారయ్యాము. అబ్బాయిలిద్దరూ కారు క్లీన్ చేస్తామని వెళ్ళారు. అమ్మాయిలందరం స్నోలో ఫోటోలు తీసుకున్నాం. ఎంతో ప్రశాంతంగా అనిపించింది. బయటకి వెళ్ళకుండా అలానే ఆడుకుంటూ ఉండాలనిపించింది. వాళ్ళు ఫోన్ చెయ్యగానే మేము బయటకి వెళ్ళాము. అదృష్టవశాత్తూ రోడ్లన్నీ క్లీన్‌గానే ఉన్నాయి. దాంతో ఇబ్బంది కలగలేదు. సబ్‌వేలో భోంచేసి, ఆర్కన్సీస్‌కి బయలుదేరాము.

దారిలో రోడ్డు బాగుండక పోవడంతో కొద్దిసేపు ఎక్జిట్ తీసుకుని ఆగాము. ఆ తరవాత నిదానంగా డ్రైవ్ చేసాము. అంతా మబ్బుగా ఉండడంతో కాస్త భయమేసి దిగులు కలిగింది. దూరం ఎక్కువ ఉండడంతో రవి, రోషణ్ ఒకళ్ళ తరువాత ఒకళ్ళు డ్రైవ్ చేసారు. ఆర్కాన్సిస్ చేరగానే హమ్మయ్య అనుకున్నాం. అంతా అలిసిపోవడంతో ఎక్కడికీ వెళ్ళకుండా గదిలోనే ఉండిపోయాము. పరదేశి సినిమా చూస్తున్నంతసేపు నవ్వుతూనే ఉన్నాము. అప్పటిలో ఆ సినిమాని చూసి జనాలు ఏమనుకున్నారో కానీ ఇప్పుడు మాత్రం బలే నవ్వొచ్చేలాగా ఉంది. తను చెప్పిన నేవీ పియర్ పాట వల్ల మూడురోజులకు సరిపడా కాలక్షేపం దొరికింది. వాళ్ళెవ్వరూ పడమటి సంధ్యారాగం చూడకపోవటంతో అది మొదలు పెట్టాము. స్నో పడకపోయినా రోడ్లు ఎలా ఉంటాయో తెలియవు కాబట్టి పిజ్జా హట్ నుండి ఆర్డర్ చేసుకుని గదిలోనే తిన్నాము.

వాళ్ళకి ఎలా అనిపించిందో కానీ నాకు మాత్రం విశ్రాంతి తీసుకోవడం హాయిగా అనిపించింది. మాటల్లో తను అంత పెద్ద సుట్ కేస్ ఎందుకు తెచ్చాడని పాప రోషణ్‌ని అడిగింది. అతను ఏమీ చెప్పలేదు.

"చిన్న సూట్ కేస్ లేదేమో" అన్నాను.

"బ్యాక్ ప్యాక్‌లో సర్దొచ్చుగా" అంది.

"సరిపోవేమో?" అన్నాను.

"సూట్ కేస్ చిన్నది ఉంది వీడి దగ్గర" రవి అన్నాడు.

"మరి ఎందుకు తేలేదు?" పల్లవి అడిగింది.

బదులు లేదు.

"అసలు ఏమున్నాయి?" నేను అడిగాను.

అంతా తననే చూడ్డంతో, "అవసరానికి ఉంటాయని అన్నీ తెచ్చాను" అన్నాడు.

"అన్నీ అంటే?" పాప అడిగంది.

"అదే కొన్ని వస్తువులు" అన్నాడు.

"ఏ వస్తువులు?" అడిగాను.

"ఏవో చిన్న చిన్నవి."

"అంటే నసగకుండా సరిగ్గా చెప్పు" పల్లవి దబాయించింది.

"కొన్ని హోటల్స్‌లో కిచెన్ ఉంటుంది. ఇలా స్నో పడినప్పుడు పనికొస్తుందని ఒక పాను, ఒక బాండీ తెచ్చాను" అన్నాడు.

అందరం పగలబడి నవ్వాము. నేను నమ్మలేదు.

"ఉప్పు, పప్పు కూడా తెచ్చావా?" రవి అడిగాడు.

"చిన్న డబ్బాలో తీసిపెట్టాను కొన్ని, కానీ అది మర్చిపోయాను" బాధపడ్డాడు.

"జోక్ చేస్తున్నావా?" అడిగాను.

"జోక్ కాదు. నిజమే. చాలామంది అంతే చేస్తారు."

అందరం పెద్దగా నవ్వాము. కాస్త కుదుటపడ్డాక, 'నీ పేరేంటి అసలు?' రవి పాపని అడిగాడు.

ఓ క్షణం నిశ్శబ్దం తరవాత "రామ్" బదులిచ్చింది.

"ఏంటి?" అడిగాను.

"రామ్" మళ్ళీ చెప్పింది.

"నీ పేరు రామా?" పల్లవి అడిగింది.

నా పూర్తిపేరు రా మ్ పాప."

నేను నవ్వు ఆపుకోలేకపోయాను.

"అబ్బాయి పుడితే రాంబాబు అని పెడదాం అనుకున్నారట. అమ్మాయి అయ్యేసరికి రామ్ పాప అని పెట్టారు."

"అదేంటి? అమ్మాయి అయితే సీత అని కదా పెట్టాలి?" రోషణ్ అడిగాడు.

"సీత అని పేరు పెడితే కష్టాలు కలుగుతాయని అంటారు" పల్లవి చెప్పింది .

"మా అమ్మమ్మకి చాదస్తం ఎక్కువ. పేరులో రాముడు ఉండాలని పంత పట్టిందట. అందుకే అందరికీ పాప అని చెప్తాను" అంది. నాతోపాటు అంతా నవ్వారు. పాపం కోపగించుకోకుండా పాప కూడా నవ్వింది.

అలా కబుర్లు చెప్పుకుని కాలక్షేపం చేసి మా గదికి వెళ్ళిపోయాము.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story